

# ఇంద్రధనుస్సు

— రావినూతల సువర్ణాకన్నన్

"రాధీ!....రాధీ!"

అమ్మ కేకవిన్న నేను ఉలిక్కిపడి లేచాను. కళ్ళు నులుముకుని చూసినా ఇంకా వెలుగు రేఖలు పూర్తిగా రానేలేదు. "ఏమ్మా?" అంటూ బద్ధకంగా మరోవైపు తిరిగి పడుకున్నాను.

"ఇంకా లేవలేదూ? లే! లే! అయిదు దాటింది. కాస్త వాకిలీ, అదీ ఊడ్చి ముగ్గెయ్యి! నేను కాస్త పెంద్రాళే వెళ్ళాలి. చినబాబొస్తున్నాడు. ఆఁ....మీ నాన్న లేస్తే కాస్త కాఫీ అదీ చూడు. అన్నట్టు రాముడులేస్తే కాస్త చద్దన్నం పెట్టి స్కూల్‌కి పంపు. ఏం వింటున్నావా?" అంది అమ్మ దొడ్లోంచే కాస్త గట్టిగా.

"అలాగేలేమ్మా! నువ్వెళ్ళు! అయినా చిన బాబు వస్తుంటే నువ్వెందుకు ఇంత చీకటితో వెళ్ళడం?" విసుగ్గా అంటున్న నన్ను వురిమి చూసింది అమ్మ నా దగ్గరికి వచ్చి.

"ఏమిటీ? మతిపోయిందా? నిద్రమత్తు వదల్లేదా? లేకపోతే ఇంకా కలల లోకంలోనే వున్నావా?"

"అబ్బ! సరేలే! వెళ్ళమ్మా! ఎరక్కపోయన్నాను. ఆఁ....జాగ్రత్త! కుక్కలుంటాయి.... అయినా ఇంత చీకటితో రమ్మన్న మనిషి కాస్త వాళ్ళ పాలేరుని పంపకూడదూ?" అన్నాను, బద్ధకంగా లేచి ఒళ్ళు విరుచుకుంటూ.

అమ్మ నా మాటలకేం సమాధానం చెప్పకుండానే ఏదో గొణుక్కుంటూ వెళ్ళిపోయింది.

మరోసారి బద్ధకంగా ఆవులించి కొంగు బిగించి పనిలోకి దిగాను. నా మనసంతా చికాగ్గా అయిపోయింది. "భగవంతుడా, ఇంకే జన్మలోనూ పేద ఇంట పుట్టించకు. ఒకవేళ పుట్టించినా తొలి సంతానంగా మాత్రం అస్సలు పుట్టించకు!" రోజూలాగే గొణుక్కుంటూ పన్లు ముగించాను.

నాన్న కాఫీతాగి బైటికెళ్ళిపోయాడు. నాకు ఊహ తెలిసినప్పటి నుంచి తండ్రి తిని తిరగటం తప్ప కానీ సంపాయించటం ఎరగను. తాతలనాడు బోలెడు ఆస్తి వున్నా అది క్రమేపీ హారతి కర్పూరంలా హరించుకుపోయి "రెక్కాడితేనేగానీ డొక్కాడదు." అన్న స్థితిలోకొచ్చాం.

నాకు ఊహ తెలిసిన నాటి నుంచి, అమ్మ జానకి రామయ్యగారింట్లో వంట చెయ్యటం, నాన్న బలాదూరుగా తిరగటం చూస్తూనే వున్నాను.

అమ్మ తెచ్చే దాంట్లోనే, నేను, అమ్మా, నాన్న,

ఇద్దరు తమ్ముళ్లు ముగ్గురు చెల్లెళ్ళు బతకాలి.

ఇంట్లో వున్నంతసేపూ అమ్మా నాన్నల మధ్య యుద్ధమే. అమ్మా వూరుకోదు. నాన్నా వూరుకోరు. పిల్లలు ఒక్కళ్ళూ చెప్పినమాట వినరు, ఏమిటో! అసలు పోషించలేని వాళ్ళు ఇంత మందిని ఎందుక్కనాలి? ఏమోబాబూ! నేనైతే ఇంత మందిని చచ్చినా కనను.

"అక్కా నాకు అన్నం!"

"తెల్లనాగిందా?" విసుక్కుంటూ అందరికీ అన్నాలు పెట్టి వాళ్ళని స్కూల్‌కి పంపాను.

నేను పుట్టిన చాలా కాలానికి వాళ్ళు పుట్టారు. అయితే వాళ్ళ మధ్య మాత్రం అంత తేడాలేదు.

హుఁ....సాయంత్రం కూడా పెంద్రాళే రాదు మా అమ్మ. మామూలుగా అయితే ఉదయం పదింటికెళ్ళి పన్నెండు ఆ ప్రాంతాలకి వస్తుంది. మళ్ళా సాయంత్రం నాలుగింటి కెళ్ళి ఎనిమిదికల్లా వచ్చేస్తుంది. అయితే ఈ రోజు జానకిరామయ్య గారి ఏకైక పుత్రరత్నం విదేశాల్లో చదువు ముగించుకుని తిరిగి వస్తూన్న కారణాన అమ్మని ఈ రోజంతా అట్టే పెట్టేస్తారనుకుంటాను.

జానకి రామయ్య, యశోదమ్మగార్లకి పుట్టిందే ఒక్కడు. లక్షలాస్తి! ఒక్కగానొక్క కొడుకైనా అతని కోరిక కాదనలేక విదేశాలకి పంపారు. ఇప్పుడు అతగాడో మంచి డాక్టరై తిరిగొస్తున్నాడు. అయినా కలవారికి పిల్లలు కూడా తక్కువగానే వుంటారు అదేం వింతోగానీ!

కొంతమంది అమ్మలక్కలు, "అంత దూరం ఎలా పంపారమ్మా — ఒక్కగానొక్క కొడుకుని? ఏమో బాబూ! మేం మా పిల్లల్ని వదిలి క్షణం ఉండలేం. అసలు కాస్సేపు వాళ్ళు కనిపించకపోతే మాకు పిచ్చెక్కినట్టే ఉంటుంది" అంటూ బుగ్గలు నొక్కుకున్నా యశోదమ్మగారు అంతగా లక్ష్య పెట్టలేదు. నిజంగా ఆవిడ ఎంత గొప్ప ఇల్లాలు'...

"ఏమో! నా పిల్లల్ని మాత్రం ఏ కాస్త అవకాశం ఉన్నా చక్కని చదువులకి పంపుతాను. అసలు అమెరికానే పంపితే?...." నా ఆలోచనలకి నాకే నవ్వొచ్చింది. నా పెళ్ళవటం, నాకో కొడుకు పుట్టటం, వాణ్ణి అమెరికా పంపి చదివించటం, ఓహ్! ఎంతాశ! ముందు కడుపు నిండా తిండీ, వంటి నిండా బట్టా ఉంటే ఈ కోరికలన్నీ తీరినంత ఫలం!" చిన్నగా నిట్టూరుస్తూ చేటలో బియ్యం పోసుకుని గుమ్మంలో కూలబడి రాళ్ళేరటం మొదలుపెట్టాను.

"ఏం రాధీ! నీలో నువ్వు నవ్వుకోవటం, మళ్ళా దిగులుగా నిట్టూర్చటం! ఏమిటి సంగతి?" అంటూ వచ్చింది మా పక్కింటి పిల్ల, నా స్నేహితురాలు అయిన జానకి.

నేను కొంచెం ఉలిక్కిపడి తేరుకుని "అఁ.... ఏం ఉంది? నా కలల సంగతి నీకు తెలుసుగా, వించునే కలలు కనేస్తూ ఉంటాను." అనేశాను నవ్వుతూ. నన్నంతా 'కలల రాణి' అంటూండటం దానికి తెలుసు.

నిజంగానే నాకు చిత్రమైన కలలు వస్తూంటాయి. అసలు నాకు మెలకువ కన్నా నిద్రంటేనే ఎంతో యిష్టం! ఎందుకంటే ఆ నిద్రలో తియ్యని కలలు ఎన్నెన్నో కనచ్చు. ఆ కలలకి పేదా, గొప్పా, అనే తేడాగానీ, రాత్రీ-పగలూ అనే తేడాలు గానీ అసలుండవు. ఎప్పుడు నిద్రపోతే అప్పుడే స్వప్నజగత్తులో కెళ్ళిపోవచ్చు.

"రాధీ! మధుబాబు వచ్చాడు. నేనిప్పుడే చూసి వస్తున్నాను. ఎంత బావున్నాడనుకున్నావ్? దొరబాబులా ఉన్నాడనుకో! అమ్మ పూజకి పూలు తెమ్మంటే వెళ్ళాను. అబ్బ! వాళ్ళ ఇల్లంతా ఎంత సందడిగా ఉందో!" చెప్పుకుంటూ పోతోంది జానకి. క్రమేపీ దాని మాటలు వినిపించటం మానేశాయి.

మధుబాబు రూపం రకరకాలుగా కనిపిస్తోంది. నన్ను గుర్తుపడతాడా? ఏమనుకుంటాడో నన్ను చూసి? ఏమో! ఓసారి వెళ్ళాలి.

అసలు అందరూ నన్ను అందానికి మారు పేరు అంటారు. మా అమ్మ కూడా మరీ సంతోషంగా ఉన్నప్పుడు "మా రాధిది ఎంత సిరిగల ముఖం! దానికి మంచి మొగుడొస్తాడు" అంటూంటుంది. అందుకే నా మనస్సు కొత్త పంథాలో పరిగెత్తటం మొదలు పెట్టింది.

"జానీ! సాయంత్రం ఓసారి వాళ్ళింటికెళదాం వస్తావా?" సాధ్యమైనంత అమాయకంగా అన్నాను.

"ఓ అలాగే! ఏం నీకూ అతన్ని చూడాలని ఉంది గదూ?" తమాషాగా నవ్వుతూ అంది.

"ఛీ! అదేంగాదు! ఊర్కేనే!...." తడబడుతూ నవ్వేశాను.

"అలా అయితే సాయంత్రం రెడీగా ఉండు" అంది జానకి. సరే అంటే సరే అనుకున్నాం ఇద్దరం.

ఆ రోజు సాయంత్రం పన్లన్నీ ముగించుకుని నేనూ జానకీ మధుబాబూ వాళ్ళింటికి బయలుదేరాం.

ఎందుకో వాళ్ళింట్లో అడుగు పెడుతుంటే కాళ్ళు వణికాయి.

ఇల్లంతా నిశ్శబ్దంగా ఉంది. వంట ఇంట్లోంచి మాత్రం, అమ్మా, యశోదమ్మగార్ల మాటలు వినిపిస్తున్నాయి.

మెల్లగా వంటింటికేసి నడిచాం.

"రామ్మా! రాధీ! ఏమిటిలా వచ్చారు? ఎప్పుడైనా జానకైనా వస్తుందిగానీ నువ్వు మరీ నల్లపూసవై పోయావ్, రండి! రండి!" అంటూ ఆప్యాయంగా ఆహ్వానించారు యశోదమ్మగారు.

"మరే....మరీ....జానీకి పూలు కావాలట. అందుకని తోడు రమ్మంటే...." తడబడుతూ చెప్తున్న నన్ను చూసి పక్కున నవ్విందావిడ.

"అవునా జానకీ? ఉదయం పూలు కోసుకెళ్ళావుగా? మళ్ళా ఏం పూలు? నాకు తెలుసులే మీరెందుకొచ్చారో-బాబుని చూసిపోదామని వచ్చారు కదూ? ఫరవాలా రండి. ఇలా కూర్చోండి, వాడు స్నానం చేస్తున్నాడు" అంది నవ్వుతూ.

ఆవిడ మాటలకి ఇద్దరికీ చచ్చే సిగ్గేసింది. మౌనంగా కూర్చుని, యశోదమ్మగారు అమ్మచేత ఇప్పించిన కాఫీ తాగుతూ మధుబాబు గురించే ఊహాగానాలు చేస్తున్నాం.

ఎందుకో మా అమ్మ ముఖం అప్రసన్నంగా ఉంది. అయితే ఏం మాట్లాడలేదు.

దాదాపు పది నిమిషాల తరువాత మధుబాబు తల తుడుచుకుంటూ గదిలోకెళ్ళటం ఛాయా మాత్రంగా గోచరించింది.

"నాన్నా! మధూ! నీ పనయ్యాక ఓసారిలా రా!" గట్టిగా అంది యశోదమ్మగారు.

"ఒస్తున్నానమ్మా?" అన్న అయిదు నిమిషాల తరువాత వచ్చాడు.

"చూడు మధూ! వీళ్ళెవరో?" నవ్వుతూ అంది తల్లి. అతను పరీక్షగా మాకేసి చూస్తుంటే వళ్ళంతా చెమటలు పట్టినట్లయి గభాల్న లేచి నిల్చున్నాను.

"ఓ! రాధీ, జానీ గదూ?" తనూ ఆప్యాయంగా నవ్వుతూ అన్నాడు.

"గుర్తుపట్టావే! ఫరవాలా! పెద్దవాళ్ళయిపోయారు గదూ?" అని, "ఏమ్మా! పాత మధుబాబులానే ఉన్నాడా, లేకపోతే కొత్తగా ఉన్నాడా?"

చిరునవ్వుతో అడిగింది యశోదమ్మగారు.

అప్రయత్నంగా ఇద్దరం అతనికేసి చూశాం. జానకి సంగతేమోగానీ నా గుండె మాత్రం ఝల్లు మంది. 'మధుబాబు ఎంత అందంగా ఉన్నాడు! ఎంత మంచి రంగు! ఎంత స్ఫురద్రూపి!' తన్మయత్వంగా అనుకున్నాను.

"ఏం రాధీ! మర్చిపోయావా? ఎలా వున్నావు?" చిలిపిగా చూస్తూ అన్నాడు.

"ఓ మంచి డాక్టరులా" అంటూ రివ్వున పరిగెత్తాను జానకి చెయ్యందుకుని. వెనకనుంచి అంతా నవ్వుతున్నట్లు వినిపించింది.

ఎందుకో నా మనసంతా గాల్లో తేలిపోతూంది. నేనున్న పరిసరాలుగానీ, నా పక్కన జానకిగానీ కనిపించటం మానేసి సర్వం మధుబాబే కనిపిస్తున్నాడు.

"ఏమే! ఏమిటా పరధ్యానం? మనింటి కొచ్చేశాం!" ముందుకు సాగిపోతున్న నన్ను ఒక్క గుంజు గుంజి ఆపింది జానకి. క్షణం సిగ్గు పడిపోయాను.

"వస్తా జానీ! పిల్లలేం చేస్తున్నారో!" అంటూ ఇంట్లోకొచ్చేశాను. ఆ ఇల్లు, ఆ వాతావరణం, చూసి వాస్తవంలోకి రాక తప్పలేదు. ఒక్కసారి స్వర్గంలోంచి నరకంలోకి దూకినట్లయింది.

"ఏం అక్కా! ఎక్కడికెళ్ళావు ఇంతసేపు? ఇందాకట్నుంచి ఆకలేస్తోంది, దా.... అన్నం పెడుదుగానీ!" అంటూ చెయ్యి పట్టి లాగాడు నా చిన్న తమ్ముడు శివుడు.

"ఛీ! ఎప్పుడూ తిండి యావే! వెధవ కొంప! దరిద్రపు సంత!" ఒక్కసారి చెయ్యి విదిల్చి కుంటూ అన్నాను గట్టిగా.

క్షణం సేపు వాడు కొయ్యబారిపోయాడు. ఎందుకంటే నేను ఎవర్ని విసుక్కున్నా వాణ్ణి మాత్రం ఎప్పుడూ విసుక్కోను. వాడి బిత్తర చూపులు చూసిన నాకు, నా మీద నాకే అసహ్యం వేసింది.

"రానాన్నా! అన్నం పెడతాను!" అని వాణ్ణి పొదివి పట్టుకుని, "రండర్రా!" అన్నాను మిగతా పిల్లలతో. వాళ్ళు "బతుకు జీవుడా" అన్నట్టు వచ్చి మారు మాట్లాడకుండా అన్నాలు తినేశారు. పిల్లలు అన్నాలు తినగానే ఎంగిళ్ళు తీసి వంటిల్లు సర్ది నాన్నకోసం చూస్తూ వాకిట్లో మెట్లమీద కూలబడ్డాను. పిల్లలు లాంతరు ముందు కూర్చుని పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు.



కార్పొరేటర్

కొలుకులపల్లి సరోజిని

శ్రీమతి కొలుకులపల్లి సరోజిని, కృష్ణా జిల్లా గన్నవరం తాలూకా, పానుకుమాడు గ్రామంలో 1943 వ సం॥లో నిరుపేద హరిజన వ్యవసాయ కార్మిక కుటుంబంలో జన్మించారు. 1956 లో వివాహ రీత్యా విజయవాడకు తరలి వచ్చిన సరోజిని, మహిళా సంఘం కార్యకర్తగా సాంఘిక సేవలో విశేష కృషి సాగించారు. భర్త, భారత కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్ట్) సేవలో వుండడం చేత, సరోజిని, ఆ పార్టీ కార్యకలాపాలు ఆకళింపు చేసుకుని ఆ పార్టీ టిక్కెట్టు మీద విజయవాడ కార్పొరేషన్ ఎన్నికలలో కార్పొరేటర్‌గా, హరిజన రిజర్వుడు స్థానంలో పోటీ చేసి గెలుపొందారు.

సంఘంలో స్త్రీలకు జరిగే అన్యాయాలకు వ్యతిరేకంగానూ మహిళలకు వుపాధి కొరకు గట్టిగానూ పోరాడాలనే లక్ష్యం గల శ్రీమతి సరోజిని విజయవాడ నగరాభివృద్ధి కోసం తన డివిజన్‌లో పేదలు నివసించే ప్రాంతాల్లో రోడ్లు, వీధి దీపాలు, మంచి నీటి సౌకర్యం, మరుగుదొడ్లు, మురికి నీటి పారుదల మొదలైన సౌకర్యాల కొరకు కృషి చేస్తానని చెప్పారు.

—విజయవాడ విలేకరి

మళ్ళా నా ఆలోచనలన్నీ మధుబాబు మీదికే పోయాయి. అబ్బ! అతను ఎంత చక్కగా నవ్వుతాడు! ఏ పిల్ల పూజ చేస్తోందో అతని కోసం!

"అతనిలాంటివాడు నాకు భర్త అయితే? ఛీ! నక్కెక్కడ, నాగలోకమెక్కడ?" సన్నగా నిట్టూర్చాను.

"నువ్వు అందంగా ఉంటావుగా ఎవరైనా చేసుకుంటారేమో!" మనస్సు సన్నని ఆశా జ్యోతిని వెలిగించింది.

"ఊహూఁ. లాభంలేదు! అందం ఒక్కటే ఉంటే చాలదు. కనీసం మంచి చదువు కూడా లేదు. చిన్నప్పట్నుంచీ ఈ పిల్లల్ని సాకటంతోటే సరిపోయింది. కనడమైతే అమ్మ కన్నదిగానీ వీళ్ళని పెంచటమంతా తనే! కాస్తో, కూస్తో టైము దొరికితే తియ్యని కలల కోసం నిద్రపోతుంది.

ఏనాటికైనా నా కలలు నిజమౌతాయా! ఏమో! అదృష్టదేవత కన్నుతెరిస్తే తన ఆశలు నెరవేరటం ఎంతసేపు?

"ఏం ఇంకా గడపలో కూర్చుని ఏం చేస్తున్నావ్?" అమ్మ కంఠం ఖంగున మోగింది.

"నాన్న కోసం చూస్తున్నానమ్మా! ఇంకా రాలేదు." అన్నాను మెల్లగా. ఎందుకో ఆ రోజు అమ్మచేత చివాట్లు తప్పవని తోచింది నాకు.

"అవునూ.... ఇందాక అక్కడికెందుకు వచ్చారు? కాస్త తోడు రమ్మని బతిమాలినా రాని దానివి పిలవా, పెట్టకుండా ఎందుకొచ్చావ్?" దాదాపు గద్దించినట్టే అడిగింది.

ఆవిడ మాటలకి నాక్కాస్త కోపం వచ్చిన మాట నిజమే! "అవును వచ్చాను! మధు బాబుని చూద్దామనే వచ్చాను. చాలా రోజుల తరువాత అతనెలా ఉన్నాడో అనే కుతూహలం కొద్దీ వచ్చాను. దానికింత రాద్ధాంతమేమిటి?" అన్నాను.

"అబ్బబ్బ! మాటకి మాట! తండ్రారకం కూతురీరకం! నాకు చావైనా రాదేంరా భగవంతుడా?" అంటూ సణుక్కుంటూనే ఉంది అమ్మ చాలాసేపు.

నాన్న రాగానే ఆయన మీద విరుచుకు పడింది. అసమర్థుడని ఆయన్నీ, ఇలాంటి పెళ్ళాం పిల్లల్ని పోషించలేనివాడికిచ్చి చేసిన తన తల్లి తండ్రుల్నీ, తల్లి మాటలకి ఎదురు చెప్పే ఇలాంటి సంతానాన్నిచ్చిన భగవంతుణ్ణీ వైన వైనాలుగా తిట్టింది.

అయితే ఇవన్నీ మాకలవాటే కనుక కామ్‌గా ఊరుకున్నాం. ఏకళనున్నాడో నాన్న కూడా పిల్లిలా కూర్చున్నాడే గానీ మారు మాట చెప్పలేదు.

ఆ రోజు తరువాత మధుబాబు రెండు మూడు సార్లు కనిపించాడు. చూసినప్పుడల్లా స్నేహపూర్వకంగా నవ్వేవాడు. ఆ నవ్వులో నాకెన్నో

అర్థాలు స్ఫురించేవి.

జానకిని చూసి అలా నవ్వదేం? చిన్నప్పుడు కూడా నన్ను సైకిల్ మీద ఎన్నోసార్లు ఇంటికి తీసుకొచ్చి దింపేవాడు. వాళ్ళ తోటలోని మామిడి కాయలు కోసిచ్చేవాడు. ఎలాగైనా నేనంటే అతనికి ప్రత్యేకమైన అభిమానం! అలా అనుకుంటేనే నా మనసంతా తియ్యగా మధురాతి మధురంగా తోచేది.

రోజులు గడిచిపోతున్నాయి. నా దిన చర్యలో ఏమీ మార్పు లేదు.

ఓ రోజు అమ్మకి పుట్టెడు జ్వరం ముంచు కొచ్చింది. యశోదమ్మగారికీ వార్త చెప్పి, ఆవిడ వంటలో కాస్త సాయం చెయ్యమనీ అమ్మ నన్ను బ్రతిమాలింది. నాన్న కూడా, "వెళ్ళు రాధీ! మనల్ని వాళ్ళెంతగానో ఆదుకుంటున్నారు. ఇక్కడ నేనూ చెల్లాయిలూ చూసుకుంటాంలే!" అన్నాడు.

ఎప్పుడు బ్రతిమాలినా నేను చచ్చినా వెళ్ళేదాన్ని కాదు. కానీ....ఈసారి వాళ్ళ మాటలు నాకు పన్నీటి జల్లులా తోచింది. అయినా పైకి, "పోనీమ్మా ఓ పూట వెళ్ళకపోతే మాత్రం యేం?" అన్నాను తెచ్చిపెట్టుకున్న విసుగుతో.

"అలా కాదమ్మా! వాళ్ళు మనల్ని తల్లీ తోడులా చూస్తున్నారా మరి! కనీసం మాటయినా చెప్పద్దూ? సాయంత్రం వెళ్ళొద్దులే!" అంది అమ్మ బతిమాలుతూ.

"అలాగేలేమ్మా! నువ్వు పడుకో!" అని, నాన్నకి చెప్పవలసినవి నాన్నకి చెప్పి బయలు దేరాను. ఎందుకో నా మనసంతా వింతగా, తియ్యగా అనిపించసాగింది.

యశోదమ్మగారింటికొచ్చేసరికి ఆవిడ అమ్మ కోసం ఎదురు చూస్తోంది. సంగతి విని, "అలాగా! ఏం జ్వరమో ఏమో! అసలే ఊళ్ళో బాగా లేదు. తనే రాకపోయిందా మధు కాస్త మందేమైనా ఇచ్చునుగా! పోన్లే నువ్వెళ్ళేప్పుడు తీసికెడుదువు గాని! రా!" అంటూ ఆప్యాయంగా లోనికి తీసి కెళ్ళింది.

ఎంతో ఉత్సాహంగా పనిచేసుకుపోతున్న నన్ను ఆశ్చర్యంగా చూసిందామె.

"అవునూ! మీ అమ్మ నీకేం పనిపాటలు అవీ రావనీ, బొత్తిగా సహనం లేదనీ అందే? నువ్వింత చక్కగా ఇల్లు దిద్దుకుంటావని నాకు తెలియదు సుమా!" మెచ్చుకోలుగా అంటూంటే నా మనసు పురివిప్పిన నెమలిలా అయిపోయింది.

"పోనీలే! నీ మొగుడు సుఖపడతాడు!" అంటూ పెరటికేసి వెళ్ళిపోయింది యశోదమ్మ గారు.

"మొగుడు" అనగానే అనుకోకుండా చిరు నవ్వులు చిందించే మధుబాబు ముఖమే తోచింది మనసులో.

దాదాపు వంటంతా నేనే చేసేశాను. యశోదమ్మ గారి పూజ అదీ అయ్యాక భోజనాలు చేసేశాం. నేను వడ్డించి తరువాత తింటానని ఎంత చెప్పినా ఆవిడ ఒప్పుకోలేదు. మధు కూడా, "కూర్చో రాధీ! నాన్నగారు కూడా లేరుగా" అంటూ బలవంతం చెయ్యటంతో నాకు వాళ్ళతోపాటు భోజనానికి కూర్చోక తప్పలేదు. వాళ్ళ ఎదురుగా కూర్చుని టేబుల్ మీద భోంచేస్తుంటే చచ్చే సిగ్గేసింది. ఎలాగో అయిందనిపించాను.

"చూడు రాధీ! ఫ్రిజ్‌లో యాపిల్స్ వున్నాయి కాస్త తెచ్చి కొయ్యి" అంటూ ఏదో నవల తీసుకుని సావిట్లోకెళ్ళిపోయాడు మధుబాబు.

నేను యాపిల్స్ తెచ్చి మెల్లగా చెక్కు తీస్తున్నాను. అబ్బ! ఎంతహాయైన జీవితం! బరువు, బాధ్యతలు ఆమడ దూరాన నిల్చే సుఖమయమైన జీవితం!

వేసవిలో ఈ ఇల్లు మరీ స్వర్గంలా వుంటుంది. ఫ్రిజ్‌లోంచి తీసిన పళ్ళంటే నాకెంతో ఇష్టం. చిన్నప్పుడు మధుబాబు ఎన్నోసార్లు నాకు, జానక్కి రకాల పళ్ళు ఇచ్చేవాడు.

మాకూ ఓ ఫ్రిజ్ వుంటే?....నా ఆలోచనలకి నాకే నవ్వొచ్చింది. కరెంట్ వున్న ఇల్లయితే అద్దె భరించలేమని పూరిల్లు లాంటి చిన్న కొంపలో చిమ్నీయే మహాభాగ్యంగా భావించే మాలాంటి వాళ్ళకి ఫ్రిజ్‌లు కూడానా!

పరధ్యానంగా కోస్తున్న నేను యాపిల్‌కి బదులు నా చెయ్యే కోసుకున్నాను. "అరె! రాధీ చెయ్యి కోసుకున్నావా?" అని, "రంగన్నా! నా మెడికల్ ఛస్ట్ ఇలా తీసుకురా!", అని ఓ కేక పెట్టి నా చెయ్యి తెగిన చోట రక్తం రాకుండా గట్టిగా పట్టుకున్నాడు మధు.

యశోదమ్మగారు రక్తాన్ని చూసి కంగారు పడిపోయారు." ఏమ్మా! కాస్త జాగ్రత్తగా కోసుకోరూ! అదసలే కొత్తచాకు. ఏదో ఆలోచిస్తూ కోసి వుంటావు," అంటూ చనువుగా, ఆప్యాయంగా మందలించారు.

"అది కాదమ్మా! నువ్వేమో ఇందాకట్నించి "ఎంత పనిమంతురాలు" అని పొగుడుతున్నావ్‌గా! అందుకు తెగ మురిసిపోయి చకచకా కోద్దామనుకుని, పాపం—పండుకు బదులు చెయ్యే కోసుకుంది" అన్నాడు నవ్వుతూ, కట్టు కట్టటం పూర్తిచేసిన మధుబాబు.

"చాల్లేరా నీ వేళాకోళం! ఓ మూల ఆపిల్ల చెయ్యితెగి బాధ పడుతుంటేనూ!" అంటూ అతన్ని సున్నితంగా మందలించి, "రాధీ! కాస్సేపు నువ్వు అలా కూర్చో, అమ్మకి తగ్గేవరకు నేను చూసుకుంటాలే. పోనీ ఈ రోజు ఇక్కడ వుండి పోకూడదూ? మధు వాళ్ళ నాన్నగారు కూడా వూళ్ళో లేరుగా" అంది యశోదమ్మగారు.

"అమ్మో! ఇక్కడే" అనుకుని, "లేదండీ! వెళ్ళిపోతాను. మా చిన్న తమ్ముడు నా దగ్గర తప్ప పడుకోడు" అంటూ చెప్పి వచ్చేశాను.

వచ్చే ముందు మధుబాబు మెల్లగా, "సారీ రాధీ! నేనే కొయ్యమన్నాను" అన్నాడు. అతని కళ్ళల్లోకి చూసిన నాకు ఎన్నో భావాలు గోచరించాయి.

"ఫరవాలేదు. మధుబాబూ! నేనే పరధ్యానంగా వుండి కోసుకున్నాను. అసలు నేనే 'సారీ' చెప్పాలి. అమ్మగారికి కాస్త సాయం చెయ్యడానికి వచ్చి ఈ నిర్వాకం చేసి వెడుతున్నందుకు. అయినా ఇదెంత దెబ్బని, కాస్త తెగిందంతే!" అన్నాను మధురంగా నవ్వుతూ.

ఇద్దరికీ చెప్పి ఇంటికి వచ్చేశాను. అబ్బ! మధు ఎంత మధురంగా నవ్వుతాడు! అతను చేతికి కట్టు కడుతుంటే తెగిన బాధ తెలియలేదు సరిగదా ఒక విధమైన పులకింత కలిగింది!

ఇంటికొచ్చాక అమ్మ అక్షింతలు. "పెద్ద మహారాణి! పండు కూడా కొయ్యలేదు" అంటూ.

మర్నాటికే అమ్మకి జ్వరం తగ్గి మధు వాళ్ళింటికి వెళ్ళింది.

ఆ రోజు తరువాత మధుబాబు గుళ్ళోనూ, తోటలోనూ కనిపిస్తూండే వాడు, కనిపించినప్పుడల్లా స్నేహపూర్వకంగా నవ్వేవాడు, ఆప్యాయంగా పలకరించేవాడు.

అతని పేరు తల్చుకుంటేనే నా మనసంతా ఆరాధనతో నిండిపోయేది.

ఆ రోజు శుక్రవారం. ఆ సాయంత్రం నేనూ, జానకీ కలిసి శివాలయానికి బయల్దేరాం. దైవ దర్శనం అదీ అయ్యాక, మండపంలో కాసేపు

కూర్చుని, తిరుగు ముఖం పట్టాం.

అప్పుడే కను చీకట్లు ముసురుతున్నాయి. ఎండ ఉధృతం తగ్గి చల్లని గాలి వీస్తోంది.

"రాధీ! మధుబాబూ వాళ్ళ తోటలో కెళ్ళి మల్లెలు, జాజులు కోసుకుందామా?" హఠాత్తుగా అంది జానకి.

"చీకటి పడుతోంది. అమ్మ తిడుతుందేమో!" అంటూనే తోటకేసి నడిచాను. దాని పూల పిచ్చి నాకు తెలుసు. గన్నేరు పూలైనాసరే అది తల్లో పెట్టుకుంటుంది.

అలయానికీ, మా యింటికీ మధ్యగా వుంటుందా తోట. చక్కని పూలమొక్కలు, ఫల వృక్షాలు, రక రకాల క్రోటన్స్ అన్నీ పొందికగా పెంచుతారు. యశోదమ్మగారికి ఆ తోటంటే ప్రాణం!

ఆ తోటలోనే ఓ చిన్న కుటీరంలాంటిది కూడా వుంది.

ఇద్దరం తోటలోకి అడుగు పెట్టీ పెట్టకుండానే పూల పరిమళాలు పరిసరాలన్నింటినీ వ్యాపించి మనసుల్ని ఆహ్లాదపరుస్తున్నాయి.

ఉత్సాహంగా మాలి కోసం చూస్తున్న మాకు ఓ పెద్ద మల్లె పందిరి దగ్గర పూలు కోస్తున్న మధుబాబు కనిపించాడు. అతను పూలు కోసి పక్కనే అరుగు మీద పరిచి వున్న రుమాల్లో పోస్తున్నాడు. ఆ రుమాలు అప్పటికే జాజులతోనూ మల్లెలతోనూ నిండి ఉంది.

అనుకోకుండా అతన్ని అక్కడ చూసిన మేము కాస్త తత్తరపడ్డాం. వెళ్ళిపోదామని జానక్కి సైగ చేసి మెల్లగా వెనుదిరిగాను. అప్పుడే అరుగుల నవ్వడికి కాబోలు మధుబాబు మాకేసి చూసి, "అరె! వెళ్ళిపోతున్నారేం? ఎందుకొచ్చినట్టు, ఎందుకెడుతున్నట్టు?" నవ్వుతూ అన్నాడు.

"అబ్బే ఏం లేదు...అదే పూల కోసం.... ఆఁహాఁ కాదు గుళ్ళోకొచ్చాం దారిలో జానీ...."

తడబడుతున్న నా మాటలకి అతను ఫక్కున నవ్వాడు. "అది సరే! దానికింత ఖంగారు దేనికి? పూలు కావాలా?" అన్నాడు ఆప్యాయంగా చూస్తూ.

"అవును మధుబాబూ! మల్లెపూలు కావాలి కోసుకోమా?" మరీ చిన్నపిల్లలా అంది జానకి.

"అలాగే! కోసుకోండి! అదిగో ఆ మూల కనకాంబరాలు కూడా ఉన్నాయి కోసుకోండి," అనగానే జానకి రంగంలోకి దిగేసింది.



కార్పొరేటరు

భాగవతుల రామకుమారి

కుమారి భాగవతుల రామకుమారి నాగార్జున విశ్వ విద్యాలయం ద్వారా ఎం. ఏ పట్టం పొందారు. తర్వాత మచిలీపట్నం లోని ఆంధ్ర జాతీయ కళాశాలలో బి. ఇడి కోర్సులో ద్వితీయశ్రేణిలో ఉత్తీర్ణులయ్యారు. కళాశాలలో చదువుతూ వుండగానే జాతీయ సంఘ సేవాకార్య క్రమంలో ఉత్సాహంగా పాల్గొని, సంఘసేవ పట్ల అభిమానం, ఆసక్తి పెంచుకున్నారు.

93 సం॥ల క్రితం పురపాలక సంఘంగా ఏర్పడిన విజయవాడ నగరంగా ఇటీవల రూపు దాల్చింది. ఈ కొత్త నగరాభివృద్ధికి, పారిశుధ్యం, వీధులలో దీపాలు, మంచినీటి సరఫరా, రోడ్ల ప్రమాదాలు నివారించడానికి ట్రాఫిక్ సిగ్నల్స్, ట్రాఫిక్ ఐలండ్స్ విస్తృతంగా ఏర్పాటు చేయడం, నగరానికి వచ్చే ఆదాయం ఖచ్చితంగా వసూలు అయ్యేటట్లు చూడడం, అవినీతి, లంచగొండి తనాన్ని అరికట్టడం ఫిర్యాదులపై సత్వరచర్య తీసుకోవడం, ప్రధాన లక్ష్యాలుగా గల కార్పొరేటరు రామకుమారి, జనతాపార్టీ తరఫున విజయవాడ కార్పొరేటరుగా ఎన్నికయ్యారు.

—విజయవాడ విలేకరి

అదేం ఖర్మోగానీ మధుబాబుని చూస్తేనే నాకు మాట, అడుగూ కూడ తడబడిపోతుంది. మనసంతా అదోలా ఐ, మరో స్వప్న జగత్తులో తేలిపోతున్నట్టుంటుంది.

నా వయస్సుదే గదా జానకి. తనకలాంటి అనుభూతే ఉండదా? ఏమో! మెల్లగా నేనూ మల్లెలు కొయ్యటం మొదలు పెట్టాను. నిమిషాల్లో బోలెడు పూలు కోసింది జాని. లోపలికెళ్ళి ఓ న్యూస్ పేపర్ తెచ్చిచ్చాడు మధుబాబు. పూలన్నీ నలక్కుండా అందులో చుట్టిపెట్టాం.

"ఇంక వస్తాం మధుబాబూ!" అంటూ వెనుదిరిగాం.

అడుగులో అడుగు వేసుకుంటూ కొంతదూరం నడిచిన నాకు "రాధీ!" అన్న మధుబాబు కేక వినిపించి రివ్వున తల తిప్పాను. అతను ఇందాక తను కోసిన పూలన్నీ ఆ పెద్ద సిల్కు రుమాల్లో మూట కట్టి చెయ్యి నాకేసి చాచి "ఇవి కూడ తీసుకు పో" అన్నాడు.

నా గుండె లయ తప్పింది. మెల్లగా జానకికేసి "ఉండు" అన్నట్టు చూసి వెనుతిరిగి అతనికేసి నడిచాను.

"ఇదిగో రాధీ! మీ చెల్లాయిలూ వాళ్లూ ఉన్నారుగా. ఇవి కూడా తీసుకుపో, ఊరికే తోచక కోశాను." అంటూ ఆ పూల మూట అందించాడు, తడబడుతున్న చేతులతో అందుకుని, "ఇంక వస్తా మధుబాబూ! చాలా పొద్దుపోయింది," అన్నాను కళ్ళు వాల్చి.

"అదిసరే రాధీ! నేనెంత చనువుగా మాట్లాడినా నువ్వెంత ముభావంగా ఉంటున్నావేం? చిన్నప్పుడింత ఉత్సాహంగా కబుర్లు చెప్పేదానివి! నేను అప్పటి మధులా లేనా?" అన్నాడు పరీక్షగా నన్నే చూస్తూ.

"అదేం లేదు మధుబాబూ! పెద్దవాళ్ళం అయ్యాంగదా ఆ మాత్రం మార్పు సహజం. ఇంక వెళ్ళిరానా?" ఆప్యాయంగా అన్నాను. నా మాటలు నాకే వింతగా తోచాయి.

అతను మధురంగా నవ్వుతూ, "ఈ మార్పు నాకేం బాలేదు. పోనీలే! పూలు మాత్రం రోజూ వచ్చి కోసుకోండి. జానీకున్నూ పూలంటే ఎంత పిచ్చో నాకు తెలుసు" అన్నాడు.

నేను మౌనంగా తల వూపి వెనుతిరిగాను.

"ఆ పూలు తేవటానికింత సేపా? ఏం కబుర్లు తల్లీ! అయినా ఇందాకట్నించి ముంగిలా ఉన్న దానివి ఇప్పుడంత సేపు ఏమ్మాట్లాడావ్?" చిటచిటలాడుతూ అంది జాని.

దాని అసూయకి నవ్వుకుంటూ, "ఏం లేదు రోజూ వచ్చి పూలు కోసుకుపొమ్మన్నాడు" అన్నాను పూల మూటని ఆప్యాయంగా చూసుకుంటూ.

జానకి ఏం మాట్లాడలేదు.

మా ఇంటి కొచ్చాక దాని చేతిలోని పూలు కొన్ని తీసి మా చెల్లెలికిచ్చి నాతో చెప్పనైనా చెప్పకుండా వెళ్ళిపోయింది.

నేను నా పువ్వుల్లో భాగం పంచలేదు. ఆ రోజు మరీ నా మనసంతా గాల్లో తేలిపోతున్నట్టుంది. కూనిరాగం తీస్తూ వనంతా ముగించాను. నా ధ్యాసంతా ఆ పూల మూట మీదే ఉంది.

పిల్లలంతా పడుకున్న తర్వాత నా మంచం దగ్గరకొచ్చి రుమాలు విప్పాను. తెల్లగా విచ్చుకున్న మల్లెలు ఫక్కుమన్నాయి.

ఆ పూలన్నీ నా మంచంమీద, నా చుట్టూ చల్లుకోవాలనే కోర్కెని అతి ప్రయత్నం మీద ఆపగలిగాను.

మెల్లగా దోసిటనిండా తీసుకుని ఒక్కసారి వాసన చూసి మళ్ళా ఆ రుమాల్లోకే వదిలాను. ఆ సిల్క్ రుమాల్నే మురిపెంగా చూస్తూ తిరిగి మూట కట్టబోయిన నాకు దానికి ఓ మూలగా ఏవో పొడి అక్షరాలు కనిపించాయి ఆ లాంతరు వెలుగులోనే.

కుతూహలంగా లాంతరు దగ్గరగా పెట్టి చూశాను. ఓ మూల రెండు జంట గులాబీలు, దాని కింద ఆర్. డి. అని అందంగా పెయింట్ చెయ్యబడి ఉంది.

నా గుండె ఝల్లుమంది. నా పేరు రాధాదేవి! అంటే .... అంటే....మధుబాబు నన్ను ప్రేమిస్తున్నాడా! అవును! మందమతిని, ఇన్నాళ్ళూ గ్రహించలేకపోయాను.

అతనికి మొదట్నించీ తనంటే ప్రేమే! అంతెందుకు, ఇవాల్టికివ్వాళ ఈ పూలన్నీ నాకే ఎందుకివ్వాలి? కొన్ని జానక్కి కూడా ఇవ్వచ్చుగా.

ఏమైనా నా అంత అదృష్టవంతురాలు లేదు. దొరబాబు లాంటి భర్త, రాజమహల్ లాంటి ఇల్లు, పార్వతీ పరమేశ్వరుల్లాంటి అత్తమామలు, సిరిసంపదలు, ఓహ్! ఎంత మధురంగా ఉంటుంది—నా భావి జీవితం!

అమ్మా వాళ్ళని నా దగ్గరే ఉండమనాలి, ఎంత మంది తిన్నా తరగని ఆస్థి! ఈ సంగతి విని జానకి ఎంత ఏడుస్తుందో?

"మధుబాబు తన ప్రేమని ఎలా బైట పెడతాడో చూడాలి." అనుకున్నాను మురిపెంగా.

"ఇంకా ఏం చూస్తావ్? నీ పేరు తన రుమాలు మీద రాసుకుని దాన్నిండా పూలు నింపి నీ దోసిట్లో నింపితే, అంతకన్నా ఇంకెలా బైట పెట్టాలి?" గదిమింది మనసు సున్నితంగా.

పూలు నలక్కుండా మెల్లగా మూట కట్టేసి దిండు పక్కగా పెట్టి పడుకున్నాను. అవి మాల కట్టి పెట్టుకోవాలనిపించలేదు.

ఉదయమే లేచి కాలకృత్యాలు తీర్చుకుని అమ్మ అందించిన కాఫీ అనబడే కషాయాన్ని గొంతులో పోసుకుని, మధు ఇచ్చిన పూలన్నీ పెద్ద మాల కట్టాను.

ఒంటరిగా అది మెళ్ళో వేసుకుని అద్దంలో చూసుకుంటే అచ్చం పెళ్ళి కూతురిలా ఉన్నాను. ఇప్పుడు పక్కన అతనుంటే? నా చెంపల్లోకి వెచ్చని రక్తం సర్రున పాకినట్లయింది.

దండ తీసేసి జాగ్రత్తగా ఓ చోట వుంచి వాకిట్లోకి వచ్చేసరికి మధూ వాళ్ళ పాలేరు రంగన్న నిల్చుని ఉన్నాడు.

"ఏం రంగన్నా?" అన్నాను.

"అమ్మగోరు మిమ్మల్నోపాలి రమ్మన్నారు మీ అమ్మగోరితో సెప్పిరండి" అన్నాడు వినయంగా.

"అదెందుకు రంగన్నా? ఇప్పుడు నేనొస్తాగా!" అంది అమ్మ ఆశ్చర్యంగా.

"అదేమోనమ్మా! మా అమ్మగోరు మాత్రం రాధమ్మగోర్నే పిల్చుకురమ్మన్నారు" అన్నాడు వాడి మాటకి తిరుగులేనట్టు.

నేను అమ్మ అనుమతితో ఉన్నంతలో నీట్‌గా డ్రస్ చేసుకుని రంగన్న వెంట బయలుదేరాను. నడుస్తున్నానన్న మాటేగానీ నాకెన్నో అనుమానాలు.

యశోదమ్మగారు నన్నెందుకు రమ్మన్నారు? నిన్న మధు నాకు పూలు ఇచ్చినట్టు తెలిసిందా? తెలిస్తే మాత్రం ఏం కోప్పడతారా? ఏమో! అదే అయితే మాత్రం, అ కుళ్ళు జానకే చెప్పి ఉంటుంది—ఇలా ఆలోచిస్తూ ఇల్లు చేరాను.

నేను లోపలికి, రంగన్న పెరట్లోకి వెళ్ళాం. హాలంతా నిశ్శబ్దంగా ఉంది. మెల్లగా తడబడే అడుగులతో నడుస్తున్న నన్ను మధుబాబు గబగబ తన గదిలోకి లాక్కెళ్ళాడు.

క్షణం కొయ్యబారిపోయిన నేను తేరుకుని, "ఏమిటి మధుబాబూ! అమ్మగారు నన్ను అర్జంట్‌గా పిల్చుకురమ్మన్నారట?" అన్నాను అతని చేతుల్లో ఉన్న నా చేతిని విడిపించుకుంటూ.

"ఏం ఇంకా అర్థం కాలేదా?" చిలిపిగా అన్నాడు.

"నిజంగా నాకేం అర్థం కాలేదు ...అన్నట్టు... మీ రుమాలు ఇదిగో" భద్రంగా తెచ్చిన మడతని అందించాను.

దాంతోపాటు నా చెయ్యి కూడా అందుకుని, "ఈ కర్‌ఛీఫ్ చూశాక కూడా నా మనసు అర్థం కాలేదా రాధీ" మెల్లగా అన్నాడు.

"మధుబాబూ!"

"అవును రాధీ! అయ్ లవ్ యూ! అయ్ లవ్ యూ సోమచ్! నిజం! రాత్రి అమ్మకి అంతా చెప్పేశాను. అమ్మా నాన్న కూడా సంతోషంగా ఒప్పుకున్నారు. అదిగో అమ్మ కాబోయే కోడల్ని ఏదో అడగాలట" అన్నాడు కొంటెగా చూస్తూ.

నాలో కోటి వీణియలు ఏకనాదంలో మ్రోగినట్లయింది. సిగ్గులబరువుతో తల వంగిపోయింది చంపలు అరుణిమ దాల్చాయి.

రెండు చేతుల్లోనూ ముఖం దాచుకుని, బైటికి పరిగెత్తబోయి హాలు గుమ్మంలో యశోదమ్మగార్ని ఢీ కొట్టేశాను.

ఆవిడ నవ్వుతూ, "ఏం కోడలుపిల్లా, గట్టిదానివే! .మొత్తానికి" అంటూ ఆప్యాయంగా చెయ్యందుకుని పూజగదిలోకి తీసికెళ్ళారు. అక్కడ నాకెన్నో చెప్పారు.

చాలా కొద్ది వ్యవధిలో మా వివాహం, అతి వైభవంగా జానకి రామయ్యగారింట్లోనే జరిగింది. చాలామంది చెవులు కొరుక్కున్నారు. జానకి పూర్తిగా నాతో మాట్లాడటమే మానేసింది.

అమ్మావాళ్ళు ఎంత బ్రతిమాలినా మా ఇంటికి రాలేదు. అయినా మా మామగారే తోటలో మరో రెండు గదులు వేయించి పొలాలూ అవీ చూడమన్నారు. నాన్న కూడా దీనికి సంతోషంగా ఒప్పుకున్నారు.

పిల్లలంతా దాదాపు నా దగ్గిరే గడిపేస్తున్నారు· మా అమ్మ అందరితోనూ, "మా రాధమ్మది సిరిగలముఖమని నాకు ముందే తెలుసు," అని చెప్తూనే ఉంది.

పూరింట్లోంచి బంగళాలోకి, కుక్కిమంచం మీంచి, డన్‌లప్ పరుపుల మీదికి, వాటికి తగ్గ అన్ని మార్పుల్నీ అతి సహజంగా అనుభవించేస్తున్నాను.

రోజులు క్షణాల్లా గడిచిపోతున్నాయి. మధు

బాబు సాంగత్యంలోని మాధుర్యం అంతా, ఇంతా అని కాకుండా అనుభవిస్తూ కాలం గడుపుతున్నాను.

ఆ రోజు డబుల్‌కాట్ మీద కూర్చుని ఏదో ఫవల సీరియస్‌గా చదివేస్తున్న నా కళ్ళు మూశారెవరో, మధురంగా నవ్వి, "మధుబాబు!" అన్నాను సున్నితంగా అతని చేతులు తొలగిస్తూ.

"ఛీ! ఇంకా మధుబాబేమిటి? అంతా నవ్వుతారు!" అన్నాడు తనూ నవ్వుతూ నా ప్రక్కనే కూర్చుని.

"ఓ. కె! ఇంక అలా పిలవను సరేనా? అవునూ ఇంత ఆలస్యమేమిటి?" అన్నాను మురిపెంగా అతని చెంపలు నా రెండు అరచేతులతో రాస్తూ.

అలా రాస్తున్న నా రెండు చేతుల్నీ తన మెడ చుట్టూ దండలా వేసుకుని గుసగుసగా నా చెవిలో ఏదో చెప్పబోయాడు.

"రాధీ! రాధీ!" అమ్మ అరుపులాంటి పిలుపు. "ఏమ్మా?" అన్నాను ఖంగారుగా.

"లేమ్మా! చూడు టైమెంతయిందో! ఈ రోజు నేను పెంద్రాశే వెళ్ళాలి" అంది అమ్మ సౌమ్యంగానే అయినా గట్టిగా.

ఉలిక్కిపడి కళ్ళుతెరిచిన నాకు క్షణం అగమ్యగోచరంగానూ, అయోమయంగానూ అనిపించింది.

గీపురు గావురుమంటున్న పిల్లలు, వాళ్ళని మందలిస్తున్న నాన్న అరుపులూ, నా కదలికకి కిర్రుకిర్రుమనే పాత నులకమంచం, అన్నీ గ్రహించాక పూర్తి స్పృహలోకొచ్చేశాను.

ఆదుర్దాగా దిండు పక్కగా చూశాను. రుమాలులో కప్పబడిన పూలమూట కొంచెం నలిగినట్టుగా ఉంది.

నా గుండెల్లో వెయ్యి బాంబులు మ్రోగినట్టు, సప్తసముద్రాలు పొంగి నన్ను ముంచేస్తున్నట్టు అనిపించింది.

....అంటే....అంటే....ఇదంతా పట్టి కల అన్నమాట! కృంగిపోయాను.

"చూడమ్మా రాధీ! నేను వెడుతున్నాను. పిల్లలు జాగ్రత్త! ఇవాళ మధుబాబుకి తాంబూలాలు పుచ్చుకుంటున్నారు. అదే....వాళ్ళ అత్త కూతురు రాగిణీదేవి లేదూ? ఆ పిల్లట. ఒక్కతే కూతురు! లక్షలాస్థి, బి. ఎ. పాసయిందిట.

అసలు మధుబాబే ఏరికోరి చేసుకుంటున్నాట్ట. ఆ అమ్మాయి కూడ–చేసుకుంటే ఇతన్నే చేసుకుంటానని పట్టుపట్టిందట. ఏమిటే అలా చూస్తావ్? రాగిణి నీకు తెలియదూ? చిన్నప్పుడెప్పుడో వచ్చింది. నువ్వు మర్చిపోయి ఉంటావ్" అంది అమ్మ అయోమయంగా చూస్తున్న నాతో.

"అలాగా?" అన్నాను అంతకన్న నాకు నోట మాట రాలేదు. నేను కట్టినవన్నీ వట్టి గాలిమేడలు, పేకమేడలు!

"అఁ! అవును! చూడు మధుబాబుకి నువ్వంటే ఎంత ప్రేమనుకున్నావ్! వాళ్ళ అమ్మతో అన్నాట్ట! ఆడబడుచు లాంఛనాలన్నీ మన రాధకే ఇద్దాం. చిన్నప్పట్నించీ నాకు రాధంటే ఎంతో ఇష్టం, అసలు రాధకి పెళ్ళి కూడ మనమే ఘనంగా చేద్దాం, మనకే చెల్లాయి ఉంటే చెయ్యం?" అని అందుకే రేపు శంకరానికి కబురు చెయ్యాలి, ఆ మూడుముళ్ళూ వేయించేస్తే మా బాధ్యతా కాస్త తీరుతుంది," అంది సంతోషంతో కూడిన తృప్తితో. అలా అనేసి ఆమె వెళ్ళిపోయింది.

నాకు ఒక్కసారి పుట్టెడు దుఃఖం ముంచుకొచ్చింది. అంతలోనే విరక్తిగా నవ్వుకున్నాను.

లక్ష్మి, లక్ష్మినే కోరుకుంటుంది గానీ చూస్తూ చూస్తూ మూదేవిని ఆహ్వానిస్తుందా?

నా పిచ్చికళ్ళకి అందంగా కనిపించే ఈ ప్రపంచం తేనెలా అతి మధురంగా తోచిందే తప్ప, తేనే పట్టు చుట్టూ తుట్ట బాధించే తేనెటీగలుంటాయని ఈషణ్మాత్రం అనిపించలేదు.

రంగురంగులుగా, ఇంద్రధనుస్సులా ఉండే ఈ వింత జగత్తు నా కన్నె కనులకు అతి సుందరంగా కనిపించిందే గానీ, ఆ రంగుల వెనుక, అంతా శూన్యమేననీ, అది కేవలం చూపులగారడీ మాత్రమేననీ ఎంత మాత్రం తోచలేదు.

ఈ చేదు నిజం గ్రహించాక మధుబాబు ముఖం చూడాలంటేనే సిగ్గుతో ప్రాణం చచ్చిపోతోంది.

"అక్కా! అన్నం పెట్టవూ?" శివుడి అర్థింపు! "ఛీ! అప్పుడే తెల్లవారిందా?" అని విసుక్కోలేదు. "వెధవ సంత," అని తిట్టుకోలేదు. "అలాగే నాన్నా! ఒక్క క్షణం!" అంటూ లేచాను—కన్నెమనసు చేసిన గారడీలోంచి తేరుకుంటూ. □

## కార్పొరేటరు
## డి. ఝాన్సీలక్ష్మిబాయి



శ్రీమతి డి. ఝాన్సీలక్ష్మిబాయి విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలలో కార్పొరేటర్‌గా 14 వ డివిజన్ నుండి 1268 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు. ఫార్మస్యూటికల్ పంపిణీసంస్థ 'రియల్ కెమిస్ట్' లో ఆమె భాగస్వామి. భారతీయ జనతా పార్టీ తరపున ఆమె పోటీ చేశారు.

'ఆరోగ్యమే మహాభాగ్యం' అన్నట్టు తాను తన డివిజన్ ప్రజల ఆరోగ్యం పరిశుభ్రత, వైద్య సదుపాయాల గురించి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని ఆమె చెప్పారు. ఎన్నికల ప్రచారంలో ఆమె ఇంటింటికి వెళ్ళినపుడు ప్రతి ఇంటా కనీసం ఒకరు 'ఫ్లూ', 'మలేరియా', 'టైఫాయిడ్' మొదలైన జ్వరాలతో బాధపడుతున్నట్టు కనుగొని మున్సిపల్ ఆరోగ్యశాఖాధికారికి ఈ విషయాన్ని తెలియజేసి, వెంటనే వైద్య సహాయం అందేటట్టు, పరిశుద్ధ పరిస్థితులు మెరుగుపడేటట్టు చూశారు.

వీధులలో విక్రయించే చిల్లర తినుబండారాలపై కనీసం 'పాలిథిన్' కవర్ అయినా పరచి రక్షణ ఉండేటట్టు చూడాలని ఆమె అధికారులకు విజ్ఞప్తిచేశారు. దానివలన ఈగలు, దోమలు ముసరకుండా కొంతవరకూ వ్యాధులను అరికట్టడానికి వీలవుతుంది. శ్రీమతి లక్ష్మిబాయి తెనాలి సమీపాన దుగ్గిరాల వద్ద 1938 లో జన్మించారు. ఆమె తండ్రి సంకా శ్రీరాములు స్వాతంత్ర్య సమర యోధుడు. ఆమె భర్త శ్రీనివాసరావు భారతీయ జనతా పార్టీ కోశాధికారి.

—మీరా. వై